## కథ

# బాబోయ్ పాము!

**టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి**

**తన ఖాతాలున్న బ్యాంకులో కూడా ఆటోమేషన్ ఇంప్లిమెంటయింది. కానీ అదే మిటో అదివరలో అరగంటలో అయ్యే పని పూర్తవ్వడానికి ఓ గంట సమయం పట్టింది.**

**పది నిమిషాలలో పని పూర్తి చేసు కుని వెళ్లవచ్చనుకుంటూ వచ్చిన తంగప్ప చిరాకు పడిపోయాడు...సకా లంలో సక్రమంగా స్పందించే తన జీర్ణాశయం గగ్గోలు పెట్టడం వల్ల... "ఈ ఆకలిని జయించలేకపోతు న్నాను" అని అనుకుంటూ.**

ఎట్టకేలకు పని ముగించుకుని బ్యాంకు మెట్లు దిగగానే కనిపించిన ఖాళీ ఆటో ఎక్కి కూర్చు న్నాడు తంగప్ప.

అతడు తన ఇంటిముందు ఆటో దిగే సమయా నికి కాంపౌండులో నిలబడ్డ ఆయన శ్రీమతి పక్కింటి కాంపౌండులోకి తదేకంగా చూస్తోంది. పక్క ఇంటి దంపతులు కూడా వరండా మెట్ల మీద నిలబడి కాంపౌండులోని మొక్కల మధ్యకు కళ్లార్పకుండా చూస్తున్నారు.

ఆటోను పంపేసి లోపలికి ప్రవేశిస్తూ ప్రశ్నిం చాడు తంగప్ప..''ఏమిటి?''

''పామండీ..పెద్దది!'' అంది ఆయన సతీమణి కళ్లు విప్పార్చి చూస్తూ.

''బాబోయ్! పామా?'' అంటూ చకచకా ప్రహరీ గోడ దగ్గరకు చేరుకుని తన భార్యా, ప్రక్క ఇంటి దంపతులూ చూస్తున్న వైపు తనూ చూశాడు తంగప్ప.

దాదాపు ఐదడుగుల పొడవున్న పాము ఎండకు తళతళ మెరుస్తూ.. తొలిసారి ఇంటికొచ్చిన బంధువు ఇల్లంతా తిరిగి చూసినట్లు.. పూలమొ క్కల మధ్యన ఆవరణంతా చకచకా కదిలి చూస్తూ తనకనువైన ప్రదేశాన్ని అన్వేషించే ప్రయత్నాలలో చాలా బిజీగా ఉంది.

''అమ్మ బాబోయ్ ఇది త్రాచు. దీన్ని వెంటనే పట్టించెయ్యడమో, చంపించెయ్యడమో చెయ్యాలి! లేకపోతే చాలా ప్రమాదం!'' అన్నాడు తంగప్ప కాస్త కంగారుగా పక్కింటి దంపతులకేసి చూస్తూ.

అయితే వాళ్లిద్దరూ తంగప్ప మాటలు పట్టించు కోకుండా, తానసలు మాటే విననట్లుగా మౌనంగా తదేకంగా పాము కదలికల్ని పరిశీలించడంలోనే నిమగ్నమైపోయారు.

'ప్రపంచంలో చాలామంది మనుషులు నోర్లుండీ మూగవాళ్లయి పోతున్నారు!' అన్న విషయం చప్పున స్ఫురణకొచ్చింది తంగప్పకు. దాంతో పాటు తన ఆకలి గుర్తొచ్చింది.

''పద..పద!'' అంటూ ఇంట్లోకి పెద్ద పెద్ద అడుగులేశాడు.

అతడు భోజనం ముగించుకుని వాష్ బేసిన్ దగ్గ రకు నడుస్తుండగా ఆయన భార్య పెరుగు పెట్టుకు వచ్చింది ''మన కాంపౌండులోనూ పాముం దండీ!'' అంటూ.

''మన ఇంట్లోనూ పామా? కొంపదీసి దగ్గర్లో ఎక్కడైనా పాముల పుట్టగానీ పగిలిందా?'' కంగా రుగా అంటూ గబగబా చెయ్యి కడుక్కుని, నోరు పుక్కిలించి పరుగులాంటి నడకతో వెలుపలికి నడి చాడు తంగప్ప.

వన విహారానికి వచ్చిన రారాజులా పూలకుండీల మధ్య నుండీ క్రోటన్లలోకి వంపులు తిరుగుతూ వయ్యారంగా సంచారం చేస్తున్న త్రాచుపామును పరిశీలించే సరికి తంగప్పకు అనుమానం కలి గింది. దానికి తగ్గట్లుగానే పక్క ఇల్లు, ఆవరణ కూడా పరమ ప్రశాంతంగా ఉన్నాయి.

తమ తూర్పు వైపు ప్రహరీగోడ దగ్గరకు నడిచి అటువైపు కనిపిస్తున్న ప్రక్క ఇంటి పక్క తలుపు వైపు చూస్తూ..

''ఏమండీ...సూర్యారావుగారూ!'' అంటూ బిగ్గరగా పిలిచాడు తంగప్ప.

నిమిషం తరువాత ఆ తలుపు రెక్కలు తెరచుకు న్నాయి. సూర్యారావు బదులు ఆయన సతీమణి ఆనందమ్మ ప్రత్యక్షమయి ''ఏమిటి?'' అంటూ ధాష్టీకంగా ప్రశ్నించింది.

'ఈమె తన జీవితంలో ఎప్పుడయినా నవ్వి ఉండ వచ్చా?' అనే ఆలోచనలో పడిపోయాడు తంగప్ప తాత్కాలికంగా పాము మాట మరచిపోయి ఆమె కేసే చూస్తూ.

''ఏమిటీ?'' మళ్లీ ప్రశ్నించిందావిడ విసుగ్గా ముఖం మాడ్చుకుంటూ.

''ఆ! అహ! ఏం లేదు. ఇందాకా మీ కాంపౌం డులో ఉన్న పాము కాస్తా ఇప్పుడు..మా కాంపౌం డులో ఉంది!'' అన్నాడు తేరుకుని.

''అవును..తెలుసు!'' అందావిడ తన సహజధో రణిలో.

''తెలుసా? ఎలా తెలుసు?'' ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు.

''ఆ గోడకానుకుని ఉన్న మా మల్లెపందిరి మీద కెక్కిన పాము గోడ మీదుగా మీ కాంపౌండులోకి దిగిపోవడం మాకు కనిపించింది కదా?''

''కనిపించిందా? మరి కళ్లారా చూసిన ఆ విష యాన్ని మాకు చెప్పాల్సిన అవసరం లేదా?'' కోపంగా ప్రశ్నించాడు తంగప్ప.

ఆమె తనదైన శైలిలో బదులు పలకకుండా చప్పున లోపలికెళ్లి తలుపులు మూసుకుంది నిశ్శ బ్దంగా.

తంగప్ప కంగారుతో తనకేం సంబంధం లేన ట్లుగా, అసలు అతని ఉనికినే పట్టించుకోకుండా అటూఇటూ పాకేస్తోంది పాము జరజరా.

పాము ఇంట్లోకి ప్రవేశించకుండా ఉండడం కోసం తంగప్ప శ్రీమతి తమ ఇంటి కిటికీలు, తలుపులూ అన్ని వైపులా మూసి వేస్తోంది.

''తాతయ్యా! నేను కొట్టెయ్యనా?'' అంటూ తంగప్ప మనవడు శివరామకృష్ణ తన హాకీ స్టిక్ పట్టుకు వచ్చాడు మహా ఉత్సాహంగా.

''నీ మొహం.. అది కాస్త తప్పించుకుంటే చాలా ప్రమాదం కానీ.. నీవిక్కడే నిలబడి దాన్ని గమ నిస్తూ ఉండు..నేనిప్పుడే వస్తాను!'' అంటూ ఇంట్లోకి నడిచాడు తంగప్ప.

రిసీవర్ అందుకుని నెంబర్లు ప్రెస్ చెయ్యగానే అవ తలి వైపు ఫోను రింగయింది.

''హల్లో! రిటైర్డ్ మేజర్ చంగప్ప హోల్డింగ్!'' అన్నాడు చంగప్ప అవతలి నుండీ నింపాదిగా.

''నీ దుంపదెగ ఫోనందుకున్న ప్రతీసారీ నీవు రిటైర్డ్ మేజరనే విషయం ప్రకటించుకోవాల్సిం దేనా? సరే ఏం చేస్తున్నావు?''


''ఓ తంగప్పా.. మిత్రమా నీవా? ఇప్పుడే మటన్ బిరియానీ, చికెన్ కూర్మా, ఎగ్ ఫ్రై, కర్డ్ కచమ్మ ర్లతో లంచ్ లాగించి కలకత్తా పాన్ వేసుకుని కూర్చుని పైప్‌లో టుబాకో దట్టిస్తున్నాను!''

''రామ రామ! నీ తిండిపుష్టి తగలెయ్యా! రోజూ ఇన్నిన్ని వంటకాలెలా వండి వారుస్తోందయ్యా ఆ మహాతల్లి? అది సరే కానీ.. మా ఇంట్లోకి పెద్ద పామొచ్చి పడిందే..ఎలా? ఏం చేసేది??''

''ఓస్.. అంతేనా? భయపడకు పది నిమిషాలలో నీ ఇంటి ముందుంటాను..ఆ! మహాలక్ష్మీ కారు తాళాలు ఇలా అందివ్వు.. వెంకట మునీ నాగన్, క్యాటరేజెస్ బెల్ట్ ఇలా పట్టుకు రారా.. తంగప్పా డ్రెస్ చేసుకుని చప్పున బయల్దేరుతాను'' అన్నాడు చంగప్ప.

అతడవతల రిసీవర్ క్రెడిల్ చెయ్యకముందే...

''వస్తున్నానండీ!'' అని చంగప్ప భార్యా, ''తెస్తున్నా తాతయ్యా!''



అని అతని మనవడూ అంటుండడం కూడా ఫోన్‌లో వినిపించింది తంగప్పకు.

★ ★ ★

చంగప్ప కారు దిగి గన్‌తో పాటు కాంపౌండులోకి ప్రవేశించే వరకూ పాము కదలికల్నే జాగ్రత్తగా గమనిస్తున్నారు శివరామకృష్ణ, తంగప్పా కలసి.

''తంగప్పా, నువ్విదూ 'ఏం మిలటరీ వాడో? ఏమో??' అంటూ పరిహాసిస్తూంటావు కదా? ఇప్పుడు ప్రత్యక్షంగా చూడు ఫైరింగ్‌లో నా ఎఫీషియన్సీని!'' అన్నాడు చకచకా గన్ లోడ్ చేసుకుని పామున్న వైపు అడుగులేస్తూ.

పాము చంగప్పనూ, అతని చేతిలోని గన్‌నూ చూడగానే తల రెండడుగుల ఎత్తుకు లేపి విశాలంగా పడగ విప్పి చూడ సాగింది.

కొద్దిగా ముందుకు వంగి జాగ్రత్తగా గన్ ఎయిమ్ చేశాడు చంగప్ప. అందు ట్రిగ్గర్ నొక్కబోతోండగా హఠాత్తుగా ప్రక్క ఇంటి తాలూకు పక్క తలుపులు పెద్ద శబ్దంతో తెరచుకున్నాయి.

''ఆగండి!'' అంటూ అరిచింది ఆనందమ్మ తలుపు ఇవతలికి అడుగు వేస్తూ.

''ఏమిటి?' అన్నాడు చంగప్ప విసుగ్గా.

''ఈరోజు సుబ్రహ్మణ్య షష్ఠి!'' అందామె కోపంగా.

''అయితే ఏమిటి?'' అన్నాడు చంగప్ప పామునో కంట కనిపెడుతూనే.

''పైగా మంగళవారము!'' అన్నాడు సూర్యారావు ఆమె వెనుక నుండీ.

''తాతాచార్యుల వారికీ, పీర్ల పండుగకూ సంబంధమేమిటి అన్నట్లు.. మంగళవారం షష్ఠికీ నా ఈ పనికీ ఏమిటి సంబంధం? ఎందుకీ ఆటంకం?'' అన్నాడు చంగప్ప చాలా విసుగ్గా.

''ఈరోజు నాగుపామును చంపడం మహా పాపం!''

''ఎవరికి..నాకా? మీకా?''

''మాకెందుకూ? మీకే!''

''నన్ను గూర్చా మీ బాధ? యుద్ధరంగాలలో లెక్కలేనంత మంది శత్రు సైనికులను చంపాను. ఇప్పుడు నాకు కొత్తగా వచ్చే పాపం ఏదీ ఉండదు! ఇదీ అలాంటిదే!!''

''అయినా సరే ఈ రోజు మీరీ పామును చంపడానికి వీలు లేదు!'' అంది ఆనందమ్మ మహాకోపంగా.

''అరెరెరె.. తంగప్పా.. మీ పక్కింటి దంపతులు చాలా చక్కగా మాట్లాడగలరే!'' అన్నాడు చంగప్ప ఒకింత ఆశ్చర్యంగా.

''ఏం మేం మూగసీనుగల మనుకున్నారా?'' అన్నాడు సూర్యారావు మహా కోపంగా భార్యను దాటి ముందుకు వచ్చేస్తూ.

''కాస్త కాదు పూర్తీ అనుకున్నాను మరి!''

''ఏం, ఎందుకనీ?''


''కోపం తెచ్చుకోకండి బాబూ! చాలా కాలంగా తంగప్ప కోసం వచ్చినప్పుడల్లా మిమ్మల్ని గమనిస్తుంటాను కదా? మీకు మాటలు రావనుకున్నాను. అదలా ఉంచుదాము కానీ ఇదేమో విషపురుగు.. దీన్ని చంపకపోతే ఎలా స్వామీ?''

''చెప్పాము కదా ఈ రోజు పరమ పర్వదినమని!''

''అవునన్నయ్యగారూ.. కంగారులో మరచిపోయాను ఈ రోజు నాగరాజును చంపడం చాలా అరిష్టం!'' అంటూ వరండాలోకి వచ్చింది తంగప్ప శ్రీమతి కంగారుగా.

''తంగప్పా, చెల్లెమ్మ కూడా ఒద్దంటున్నారు కదా? ఏమిటి చెయ్యడం? చేత్తో పట్టి అవతల పారెయ్యాలంటే నాకూ భయమే!''

''ఏమిటీ ఇంతటి మిలటరీ వాడికి కూడా భయమేనా? అందుకే దేశం ఇలా అఘోరిస్తోంది!'' అన్నాడు తంగప్ప చిరాకుగా.



''అది విషసర్పమయ్యా! తుపాకీతో అయితే ఏటుకెదిరించెయ్య వచ్చు. కఱ్రతో అయినా రెండే ట్లకు చంపెయ్యవచ్చు కానీ.. ప్రాణాలతో పట్టి పారె య్యాలంటే భయమే కదా!'' అన్నాడు చంగప్ప నిరుత్సాహంగా గన్ కిందకు దింపేస్తూ.

తుపాకి ఇక పేలదని తేలిపోవడంతో శివరామకృష్ణ చాలా నిరుత్సాహ పడిపోయాడు.

''ఇప్పుడేమిటి చెయ్యడం?'' అన్నాడు తంగప్ప భయంగా.

''పుంగునూరు రోడ్డులో బసిని కొండ కింద పాముల పక్కీరప్ప ఉన్నాడు. వెళ్లి అతన్ని తీసుకు రండి!'' అన్నాడు అంతదాకా చోద్యం చూస్తూ నిలబడ్డ ఎదురింటాయన.

''ఆయనిల్లు మీకు తెలుసా?'' అన్నాడు చంగప్ప.

''తెలుసు!''

''అయితే కాస్త కార్లో వెళ్లి అతన్ని తీసుకువస్తాము. వస్తారా?''

''దానికేం భాగ్యం వెళ్దాం పదండి!'' అన్నాడాయన.

★ ★ ★

''బాబుగోరూ మీరంతా అలా అరుగు మీదికెక్కిపోండి. అంతా అనువుగానే ఉంటాది..పట్టేత్తాను!'' అన్నాడు పక్కీరప్ప తన పాముల గంప పక్కన పెట్టి తమర కఱ్రను చేతిలో ఒడుపుగా పట్టుకుంటూ.

పక్క ఇంటి పక్క తలుపులు మరోసారి తెరచుకున్నాయి చప్పున.

''ఏయ్, పాములబ్బీ. ఆ పామును పట్టుకుని ఏం చేస్తావు?'' ఆ గుమ్మంలో ప్రత్యక్షమైన ఆనందమ్మ మహోధ్రాష్టికంగా అడిగింది పెద్ద స్వరంతో.

''ఏం సేత్తాను తల్లీ.. సెరం వొలిసి ఎండగట్టి పొలిస్ బట్టి అమ్ముకుంటాను!''

''శివ శివా! అలాంటి పాపపు పని చెయ్యరాదు!'' అందామె చెవులు మూసుకుంటూ.

పక్కీరప్ప పరమ చిరాకుగా చూశాడు ఆమెకేసి. అతనికి తెలిసింది ఒక్కటే.. పాము ప్రమాదకరమైనది. దాన్ని పట్టుకుంటే నాలుగు డబ్బులిస్తారు. దాని చర్మం అమ్ముకున్నప్పుడు మరి నాలుగు డబ్బులు వస్తాయి.. అంతే! అది అతని జీవన సంవిధానంలో ఒక చిన్న భాగం కూడా. అన్నం పెట్టే విద్య పాపపు పనెలా అవుతుందో అర్థం కాలేదతనికి!

''ఇంతకూ నేనేం సెయ్యాలి తల్లీ!'' అన్నాడు విసుగ్గా.

ఆమె ఏదయినా చెప్పేలోపే అంది తంగప్ప భార్య. ''చూడబ్బాయ్! ఈ రోజు పర్వ దినం. ఈ పామును జాగ్రత్తగా పట్టుకుపోయి ఊరి బయట ఎక్కడైనా వదిలి పెట్టెయ్యి. డబ్బులు కావాలంటే కాస్త ఎక్కువ తీసుకో నాయనా!''

పక్కీరప్ప తల గోక్కున్నాడు పర్వ దినం అంటే ఏమిటో తెలియక!

తరువాత పామున్న చోటుకు వెళ్లి చురుగ్గా చూశాడు.

''ఒరేయ్ నాగరాజా ఎక్కడైనా పొలాల్లో పడుండక ఈ బాపనయ్య గారింటి ముందు నీకేం పనిరా?'' అంటూ ఒడుపుగా పాము తలక్రింద తమరతో అదిమిపట్టేసి ఆపై ఎడం చేత్తో పాము తలను గట్టిగా పట్టుకుని తమర కొయ్య తీసివేశాడు. అప్పుడిక పాము అతని ఎడం చేతికి బిగుతుగా చుట్టుకుని తోకతో కొట్టే ప్రయత్నం చేస్తోంది.

జేబులోంచీ కుడిచేత్తో చిన్న కత్తి తీసి, ఎడం చేతి వ్రేళ్లతోటే మరింత ఒడుపుగా పాము నోరు తెరిచి పట్టుకుని కత్తితో కోరలు జివిరేసి విషం ఒత్తిఒత్తి పిండేశాడు.

ఆ కార్యక్రమం ముగిశాక వెదురుబుట్ట మూత కాస్త తెరచి పామును బుట్టలోకి పంపించి మూత మూసేశాడు.

పక్కీరప్పతో పాటు తంగప్ప, శివరామకృష్ణ, ఎదురింటాయన కూడా బయల్దేరారు ఉత్సాహంగా చంగప్ప కార్లో.

ఘటోద్గజపురం వీధుల గుండా పరుగులు తీసిన కారు ఊరుదాటి ఫారెస్టు ఏరియా ప్రాంతాన్ని చేరుకుంది.

గంప నేల మీద పెట్టి మూత కాస్త తెరవడం ఆలస్యం. శత్రువుల చెర నుండీ తప్పించుకున్న సిపాయిలా వెలుపల పడిన పాము చాలా వేగంగా వంపులు తిరుగుతూ పాక్కుంటూ వెళ్లి పొదల మధ్య మాయం అయిపోయింది.

పక్కీరప్పను అతని ఇంటి వద్ద దింపేసి వచ్చాక తంగప్ప భార్య ఇచ్చిన కాఫీ తాగేసి వీధిలోకి వచ్చి కార్లో కూర్చోబోతూ ఎందుకో తలెత్తి చూశాడు చంగప్ప.

తను వరండాలో మూగబొమ్మల్లా నిలబడి నిరాసక్తంగా చూస్తున్న పక్కింటి దంపతులు కనిపించారతనికి.

''తంగప్పా.. మనకు ప్రకృతి రెండు కళ్లు రెండు చెవులు ఒకే నాలుక ప్రసాదించింది వాస్తవమే అని ఒప్పుకుంటాను కానీ కొంత మంది మనుషులు మరీ ఇంత నిశ్శబ్దంగా ఎలా ఉండిపోగలరంటావ్?'' అని ప్రశ్నించాడు తగ్గు స్వరంతో.

''వాళ్లలా నిశ్శబ్దంగా ఉండిపోవడం వల్ల పెద్ద నష్టం లేదు కానీ.. ప్రమాదం పక్కవాడి నెత్తిన పడబోతున్నా కూడా కనీసం హెచ్చరించాలన్న సామాజిక బాధ్యత, సంస్కారం, మనిషితనం లేకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మాత్రం హర్షదాయకం కాదు. అలాంటి వారి కన్నా ఆ పామే నయం అనిపిస్తుంది!'' అన్నాడు తంగప్ప.

## మొనాటనీకి దూరం

**ఎప్పుడూ ఒకేలా కన్పిస్తే ఏం బావుంటుంది? అందుకే తారలు కొత్తకొత్త అవతారాలెత్తుతుంటారు. పెద్దగా అవకాశాలు లేని తారలు జనం నుంచి సానుభూతి పొందేందుకు కాకుండా కొన్ని సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కొత్త ఇమేజ్‌ని సొంతం చేసుకుంటుంటారు. ఎప్పుడూ రూమర్లు, గాసిప్స్ కేంద్రబిందువయ్యే మహిమా చౌదరి ఇప్పుడు కొత్త గెటప్‌లో అందర్కీ దర్శనం ఇస్తోంది. 'ఎప్పుడూ కెమేరాలు, సినిమాల గురించి కాక మన సమాజం గురించి ఆలోచిస్తే వర్క్‌లో మొనాటనీకి అవకాశం ఉండదు' అంటోంది మహిమా.**

